
# దేవుడి బొమ్మ

— డా॥ మంతెన సూర్యనారాయణ రాజు



"ఒరే చిన్నీ! నిన్నే! ఇలా రారా నాయనా!" అంటూ ఆఖరి మనవడిని ఆప్యాయంగా పిలిచాడు పట్టాభిరామయ్య. "ఏంటీ పొద్దున్నే వాడితో రాచకార్యాలు" అంటూ దీర్ఘం తీసింది అతని కోడలు నాంచారి.

"అదేంటమ్మాయ్! నా మనవడితో మాట్లాడాలనుకోవడం రాచకార్యమెందుకవుతుంది. బాగుంది నీ వరస. కాపురానికొచ్చినప్పట్నుంచి చూస్తున్నాను. బిడ్డల తండ్రైన నా కొడుకును నా మాట వినకుండా చేశావు. ఎదిగిన నా పెద్ద మనవడు ఈ ఇంట్లో ఉండలేక దేశాలు పట్టిపోయాడు. రెండోవాణ్ణి దత్తతని చెప్పి నీ అక్కగారింటికి తోలేశావు. ఉన్న ఒక్కడికీ దూరమై నేను బతకాలనా నీ ఉద్దేశం" అన్నాడు కాస్త కటువుగానే ఆమె చెవికెక్కేలా.

"ఉఁ!ఉఁ! ఎన్ని కబుర్లన్నా చెబుతారు. అక్కడికి మీరేదో తెగ సంపాదించి మూటగట్టి మాకు పెట్టేస్తున్నట్టు. మీరు మొదట్నుంచీ చేసిన గారాబం వల్లకాదా వాడికి చదువు సంధ్యలంతగా అంటకుండా పోయింది. అల్లరి ఆకతాయి పిల్లలతో చేరి అటు చదువు రాక, ఇటు ఇంటి పన్లూ అబ్బక అఘోరిస్తున్నాడు. ఏమన్నా అంటే గతాన్నంతా తవ్వేకోస్తారు" అంటూ కన్నీళ్ళు పెట్టుకుని లోపలికి వెళ్ళిపోయింది.

అదే సమయంలో వీధిలోంచి ఆడుకుని తిరిగొస్తూ చిన్ని తాతకు కనిపించాడు. పట్టాభిరామయ్య "ఏరా ఇంత దాకా ఎక్కడికెళ్ళావురా! ఇట్రా!" అంటూ ఆర్ద్రంగా పిలిచాడు. "ఎందుకు తాతయ్యా!నీ ఒక్కడికే కాలక్షేపం కావడంలేదా!" అన్నాడు తాతగారి బొద్దు మీసాలు మెలిపెడుతూ చిన్ని.

"ఇదిగో చిన్నిగా! ఆయనతో పరాచికాలాడితే నీ గతీ నీ పెద్దన్నలాగవుతుంది. ఆ తర్వాత ఊళ్ళు పట్టుకుని పోవాల్సిందే! ఇలారా! వెళ్ళి గొడ్లపాకలో అవుకి బాల్చీతో నీళ్ళు పెట్టి, కొద్దిగా గడ్డి పరకలేసిరా" అంటూ కసిరింది.

"చూశావురా నాయనా! మీ అమ్మ కాటికి కాళ్ళు చాపుకున్న నన్ను ఎంతలేసి మాటలంటుందో! నేను మీ అన్నను దేశాలు పట్టి పొమ్మన్నమని చెప్పానా! అయినా నాకింకా చావు ఎందుకు రాకుండా పోయిందోరా! ఇంకా ఎంతలేసి మాటలు మీ అమ్మతో పడాలో" అంటూండగానే పట్టభిరామయ్య గొంతు బొంగురుపోయింది. కళ్ళు వర్షించబోతున్న మేఘాల్లా తయారయ్యాయి. తాతను గెడ్డం పట్టుకుని ఓదారుస్తూ? చిన్ని "అమ్మ మాటలంతేలే! పట్టించుకోకు" అన్నాడు. పట్టాభిరామయ్య కళ్ళవెంట జలపాతంలా నీరు కారసాగింది.

చిన్ని తన చిట్టి చిట్టి చేతులతో తాతగారి కన్నీళ్ళు తుడుస్తూ "తాతా నీకు నేనున్నాను. అమ్మ మొదట్నుంచీ ఇంతేకదా! ఇవ్వాళ కొత్తేముంది. నేనెళ్ళి గొడ్లపాకలో అవుకు నీళ్ళు పెట్టి గడ్డి పరకలేసొస్తా!" అని చెప్పి పరిగెట్టుకుంటూ చిన్ని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

నాంచారి గొడ్లపాకలోంచి తిరిగి వస్తున్న చిన్నకొడుకుని కోపంగా దగ్గరకు రమ్మంటూ పిలించింది. వాడికి తలబిరుసెక్కువని, మాటకు మాట అప్పగిస్తాడని తెలుసు. తన మాట లక్ష్యపెట్టనట్టుగా ఎంత సేపటికీ వాడు రాకపోవడంతో తానే ఎదురెళ్ళి చెవిమెలిపెట్టి వంటింట్లోకి లాక్కొచ్చింది. వాడు "నేనేం తప్పుచేశానని నా చెవి మెలేసి లాక్కొచ్చావు?" అని తల్లిని కొరకొరా చూస్తూ అడిగాడు.

"ఏం తప్పు చెయ్యడమేమిటి నీ బొంద. మీ తాతకి దగ్గూ, ఉబ్బసం ఇంకా అన్ని జబ్బులూ ఉన్నాయిరా! నువ్వాయనగారితో పూసుకుతిరగడం, ఉమ్ములు తొక్కడం చేస్తే అవి నీకు అంటుకుంటాయి. కాళ్ళు కడుక్కొచ్చి పీటముందు కూర్చో! చల్లటి పెరుగేసి అన్నం పెడతాను. ఆ తర్వాత నువ్వెళ్ళి బుద్ధిగా పాఠాలు చదువుకుందువుగాని" అంటూ బుజ్జగించింది. నాంచారి చెప్పినట్లే చేశాడు చిన్ని.

చిన్ని అసలు పేరు పట్టాభి. తాతగారి పేరే కాబట్టీ, కడవాడు కాబట్టీ అంతా అతనిని చిన్నీ అని పిలుస్తుంటారు ముద్దుగా. భోజనం చేసి పుస్తకాలు తీసుకుని తాతయ్య గదిలో కెళ్ళి చదువుకుంటానంటే నాంచారి ఏమీ అడ్డుచెప్పలేదు. వాకిలి ఊడ్చి కళ్లాపు వేసి ముగ్గులెట్టింది. బావిలో నీళ్ళు తోడి గోళెం నింపింది. తరువాత చల్ల చిలికి, వెన్న తీసింది. ఆ తీసిన వెన్నముద్ద కొద్దిగా ఉంటే చిన్నిని పిలిచి వళ్ళంతా రాసి నలుగు పెట్టి నీళ్ళు పోసింది.

ఉదయం తొమ్మిదిగంటలు కావస్తుండగా పట్టాభిరామయ్య కొడుకు సుబ్బారాయుడు పొలంనుంచి తిరిగివచ్చాడు. ఎండనపడి వచ్చాడేమో ఆయాసంగా వీధి అరుగుమీద బైఠాయించాడు. "చిన్నీ! కాసిన్ని మంచి నీళ్ళు తెచ్చిపెట్టు" అంటూ పిలిచాడు. నాంచారి భర్త కిచ్చి రమ్మని మంచినీళ్ళు చిన్నికిచ్చి పంపించింది. చిన్ని తండ్రికి మంచినీళ్ళు అందించాడు. ఖాళీ గ్లాసు కొడుక్కి అందిస్తూ "ఏరా చిన్నాడా! చిన్నన్నయ్యని పండక్కి మనింటికి పంపమని మీ పెద్దమ్మతో చెప్పి తీసుకురారా" అన్నాడు.

"అలాగే నాన్నా!" అంటూ చిన్ని ఆ గ్లాసు తీసుకుని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

★ ★ ★

ఆరోజు శివరాత్రి కావడంతో నాంచారి దత్తత కిచ్చిన కొడుకు నాగేశ్వరరావు పట్టాభిని గుడికి తీసుకువెళ్ళింది.తిరిగి ఇంటికి రావడమే తడవుగా అందరికీ ప్రసాదాలు పంచిఇచ్చింది. సుబ్బారాయుడు దేశం పట్టిపోయిన పెద్దకొడుకు శంకరం గుర్తుకొచ్చి దిగులుగా మంచంమీద పడుకుని బాధపడడం నాంచారి చూసింది. ప్రొద్దుట్నుంచీ భర్త మామూలుగా తిరుగుతున్నాడేగానీ, ఏదో పోగొట్టుకున్నట్లుగా దిగులు పడడం ఆమె గ్రహించింది. అదే సమయంలో పట్టాభిరామయ్య "అబ్బాయ్! నేనలా శివాలయం దాకా వెళ్ళొస్తాను. భజనలు, పూజలు చేస్తున్నారట్రా! శివరాత్రి జాగారం చేస్తే పుణ్యం.పురుషార్థం నెరవేరుతుంది. పెద్దాడు తిరిగన్నా రావచ్చు. నేనీ రోజు అన్నం ముట్టను" అంటూ గడప దాటాడు. "అలాగే నాన్నా! పెందరాళే వెలుగుండగానే తిరిగొచ్చేయ్! పొద్దుపోతే

చూసానదు నీకు. రాత్రి తెల్లవార్లూ నువ్వు నిద్రకాగలేవు. అయినా నీకీ వయసులో ఉపవాసాలు, జాగారాలు ఎందుకు" అంటూ ముఖం ప్రక్కకు తిప్పుకున్నాడు. పట్టాభిరామయ్య కొడుకు తన పెద్దమనవడు శంకరం కోసం పడుతున్న బాధను గమనించకపోలేదు.

పెద్దకొడుకు శంకరం ఇల్లు విడిచిపెట్టి వెళ్ళి ఆరోజుకి నాలుగు సంవత్సరాలు కావస్తోంది. పందొమ్మిదీ, ఇరవై యేళ్ళవాడు. ఎక్కడున్నాడో? ఎలాగున్నాడో? ఎటువంటి అవస్థలు పడుతున్నాడో? పదవ తరగతి తప్పినందుకు తాను తిట్టినందుకు పౌరుషంతో చెప్పా పెట్టకుండా రాత్రికి రాత్రి పరారైపోయాడు. నాంచారి కొడుకులిద్దరికీ మంచి పిండివంటలు చేసిపెట్టింది. భర్తను పిలవడానికి మండువాలోకి వెళ్ళింది. సుబ్బరాయుడు బాధతో కళ్ళు వత్తుకో[illegible] ఆమె కంటబడింది. ఆ క్షణాన ఆమె కు[illegible] దేశాలు పట్టిపోయిన శంకరం మీద అనురాగం పెల్లుబికి పైకే ఏడ్చేసింది. తిరిగి తనే గుండెదిటవు చేసుకుని "ఏమండీ! పెద్దాడికోసమేనా మీ బాధంతా! ఎన్నాళ్ళిలా కుమిలి కృశించి పోతారు. అదృష్టముంటే వాడెప్పుడో ఒకప్పుడు తిరిగి మనకు దక్కకపోడు. లేవండి. పిల్లలిద్దరూ భోజనాలుచేశారు. మిగిలింది. మీరూ నేనూ! అన్నట్టు ఈ ముసలాయన పండగపూట తిండీ తిప్పలు మానేసి ఎక్కడికిపోయాడో!" అంది.

"శివరాత్రి కదా! జాగారం చేస్తానన్నాడు. తిండికూడా తిననన్నాడు. గుడి దగ్గర భజన చేస్తున్నారంటే చూస్తానని చెప్పి అక్కడికిపోయాడు. నాంచారీ! మా నాన్ననేం సూటిపోటిమాటలు అనకే! ఆయనకి మాత్రం నేను తప్ప వేరెవ్వరున్నారు గనుక. నువ్వు అయినదానికీ, కాని దానికీ మా నాన్నమీద ఇరుచుకుపడతావు. తప్పుకదా!" అన్నాడు.

"బాగ[illegible]దండీ మీ వరస. ఆయన మీకు జన్మని[illegible] తండ్రైతే నాకు మావగారు కాదా! చిర్రెత్తుకొస్తే ఏదో అంటాను. అంత మాత్రాన అభిమానం లేనట్టేనా! ముందు లేవండీ, మీరు అన్నం తిందురుగానీ" అని చెప్పి వెళ్ళిపోయింది.

భోజనం చేసి తిరిగొస్తుంటే సుబ్బారాయుడికి దేవుడి గుడిపై పెద్దకొడుకు వేసిన వెంకటేశ్వరస్వామి బొమ్మ కనిపించింది. శంకరం మంచి చిత్ర కళాభిరుచి కలవాడు గురువు దగ్గర నేర్వకపోయినా అందంగా చిత్రాలు గీసేవాడు. చదువుకు ఎగనామం పెట్టి క్లాసులు డుమ్మా కొట్టి బొమ్మలు గీస్తూ కాలక్షేపం చేస్తుండేవాడు. ఆ పిచ్చితోటే చదువు తలకెక్కక టెన్త్‌క్లాస్ ఫెయిలయ్యాడు. ఇంటి పనులు పట్టించుకునేవాడుకాదు. రెండోవాడు దత్తుడు. వాడు మొదట్నుంచీ జాగ్రత్త కలిగినవాడు. తెలివైనవాడు. అందుకే వాళ్ళ పెద్దమ్మ తమకు పిల్లలు లేని కారణంగా నాగేశ్వరరావుని దత్తు చేసుకుంది. యదార్థం చెప్పుకోవాలంటే వాణ్ణి దత్తత ఇవ్వడం సుబ్బారాయుడికి ససేమిరా ఇష్టంలేదు. భార్య నాంచారి పోరు భరించలేక, తనకు ఆస్తి కూడా రెండెకరాలకు మించిలేకపోవడంతో గత్యంతరం లేక ఒప్పుకున్నాడు.

నాగేశ్వరరావుని తీసుకుపోవడానికి పెంపుడు తండ్రి, నాంచారికి బావగారైన కోదండరామయ్య మర్నాడు ప్రొద్దున్నే



వచ్చేశాడు. నాంచారికి కోదండ రామయ్య పద్ధతి నచ్చలేదు. కానీ ఏంచేస్తుంది. దత్తత ఇచ్చాక పంపకపోతే ఎలాగ. బావగారసలే తలతిక్కమనిషి. ఇవ్వాల్టికి అట్టే పెట్టుకుని రేపు పంపిస్తానని కోదండాన్ని బ్రతిమాలింది. కానీ ఆయనగారు వినిపించుకోకపోవడంతో కొడుక్కని కుట్టించిన బట్టలు ఇచ్చి, తినుబండారాలు కేన్‌లో సర్దిపెట్టి బాధతో వాడిని బావగారి వెంట పంపించక తప్పలేదు. చాలాసేపు వాడు వెళ్ళినవైపే బాధగా చూస్తూ నిలబడిపోయింది నాంచారి. సుబ్బారాయుడు కూడా నిస్సహాయుడుగా ఏమనలేక మిన్నకుండిపోయాడు. పెల్లుబుకుతున్న బాధ బైటపడకుండా దిగమింగుకున్నాడు సుబ్బారాయుడు.

★ ★ ★

ఎరువులు, పురుగు మందులు అరువు తెచ్చుకునే కొట్టువాడికి బాకీ చెల్లు కడతామని పట్నం బయల్దేరాడు సుబ్బారాయుడు. బస్సు దిగి రిక్షా ఎక్కాడు. కొట్టు యజమానికి పాత బాకీ జమకట్టేశాడు. మళ్ళీ మెట్ట చేనికి పురుగు పడితే మందులు, యూరియా కొని తమ ఊరెళ్ళే ఎడ్లబండి మీదవాటిని పంపించేశాడు. పొద్దు నెత్తిమీద కొచ్చింది. కాసిన్ని టీ నీళ్లైనా తాగొద్దామని పించి ఎదురుగా ఉన్న హోటల్‌కెళ్ళి రోడ్డు మీదికొచ్చాడు.

వేసవి కాలం వచ్చేయడమేమిటి? ఎండలు మండిపోతున్నాయి. ఒకటే ఉక్క. తారురోడ్లు అట్ల పెనాల్లా తయారయ్యాయి. రోడ్లమీద జనసంచారం అంతంతమాత్రంగానే ఉంది. ఒకచోట జనం మూగితే ఆ చోద్యమేమిటో చూద్దామని అటువైపు వెళ్ళాడు. ఒక యువకుడు చెమటలు కక్కుతూ రోడ్డు మీద రంగు రంగుల సుద్దలతో, మసిబొగ్గుతో హనుమంతుడి బొమ్మ నిలువెత్తుది వేస్తూ దర్శనమిచ్చాడు. ఎండనూ, తడిసిపోతున్న చొక్కాను లెక్కచెయ్యకుండా ఏకాగ్రతతో గీస్తున్నాడా బొమ్మను. కొస మెరుపులు దిద్దాడు. "ఎంతందంగా ఉందిరా బాబూ బొమ్మ! మన దేశంలో ఆదరించే వాళ్ళు లేక కళ ఇలా వీధిన పడింది. బ్రతుకు తెరువు కోసం ఎండనిప్పులు చెరిగేస్తున్నా కాన్సంట్రేషన్ చెడకుండా ఎంత బాగా వేశాడయ్యా!" అంటూ మెచ్చుకుంటున్నారు జనం. కొందరా బొమ్మమీదికి పావలాలు, అర్ధరూపాయలు విసురుతున్నారు. కొందరు ఎండ వేడిమికి తట్టుకోలేక హోటల్స్‌లోకో, చెట్ల నీడలకో, పార్కుల్లోకో జారుకుంటున్నారు.

జనాన్ని తోసుకుంటూ ముందుకొచ్చిన సుబ్బారాయుడు ఆ బొమ్మను చూశాడు. రామభక్తుడైన హనుమాన్ పారవశ్యంతో రామభజన చేస్తున్నట్టుగానే దర్శనమిచ్చింది. చిత్రంలో జీవకళ ఉట్టిపడుతోంది. మెడకు చుట్టుకున్న మఫ్లర్ తీసి ఆ చిత్రకారుడు ఒకసారి ముఖం మీద చెమటను తుడుకున్నాడు. ఆ డబ్బులు కొన్ని ఏరుకుని చిరిగిన షర్టు జేబులో వేసుకున్నాడు. రానురాను వేడికి తట్టుకోలేక జనం పల్చబడ్డారు.

అందరిలాగే సుబ్బారాయుడు జేబులోది అర్ధరూపాయి బిళ్ళతీసి బొమ్మమీద విసిరాడు. తనవైపుగా ఆ నాణెం తీసుకోవడానికొస్తున్న చిత్రకారుణ్ణి నిశితంగా చూశాడు సుబ్బారాయుడు. అప్రయత్నంగా అతని ముఖంలో రంగులు మారాయి. గొంతులో ఎంత అణచుకుందామన్నా ఆగకుండా పైకే "శంకరం" అన్న మాట బైటకొచ్చింది. ఆ యువకుడు ఎవరిదీ గొంతు అనుకుంటూ తేరిపార జూశాడు. పూర్వం తనకు పరిచయమైన గొంతే అది. దగ్గరగా వచ్చి తండ్రిని పోల్చుకున్నాడు శంకరం. వెంటనే తానున్నది వీధి అన్న విషయం మరచిపోయి "నాన్నా!" అంటూ అతని గుండెల్లో తలదాచుకుని వెక్కి వెక్కి ఏడ్చాడు. కొడుకు తలని నిమురుతూ సుబ్బారాయుడు "బాబూ! నాకు ఎంత శిక్ష విధించావు. నేను నిన్నేమన్నానని.. ఇంత శిక్ష వేశావు" అంటూ జీరబోతున్న గొంతుతో అన్నాడు. చుట్టూ వాళ్ళని గమనిస్తున్న కొద్దిమంది జనం ఆ దృశ్యం అర్థంగానట్టు మార్చి మార్చి చూస్తూ ఉండిపోయారు. రోడ్డుమీద ఉన్న దేవుడి బొమ్మ వారినే చూస్తూఉంది.